క్లుప్తంగా

నేడు రుద్రహోమం

రంగంపేట: స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రుద్రహోమం నిర్వహించనున్నట్టు అర్చకుడు మైలవరపు నాగేంద్ర తెలిపారు. మాఘ పూర్ణిమ సందర్భంగా ఉదయం 8 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తామన్నారు. స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. .

రైతులకు వివరణ

సీతానగరం: వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో సస్పెండ్ అయిన సేల్స్ వుమెన్ ఎం.భారతి కట్టాల్సిన నగదు చెల్లించడంతో ఉద్యోగాన్ని తిరిగిచ్చినట్టు ఏడీఆర్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఎం.కృష్ణమోహన్ మంగళవారం రైతులకు వివరించారు. రైతుల కోరిక మేరకు పైఅధికారులు వెదుళ్లపల్లి పీఏసీఎస్‌కు మంగళవారం వచ్చారు. ఎరువుల సేల్స్ వుమెన్‌కు ఉద్యోగం ఎందుకు తిరిగిచ్చారని ప్రశ్నించిన రైతులకు ఆయన వివరణ ఇచ్చారు. సస్పెండ్ అయిన ఆరు నెలల్లో నగదు చెల్లించడంతో తిరిగి ఉద్యోగాన్ని ఇచ్చినట్టు తెలిపారు.

ఘనంగా అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. మాఘమాసం ఆపై మంగళవారం కలిసి రావడంతో భారీ ఎత్తున భక్తులు అభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్న సమారధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం


ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న పండితులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో పోశాలమ్మ నూతన ఆలయ శిఖర యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ హోమం నిర్వహించారు. సాయంత్రం పుట్టమన్నును సేకరించారు. బుధ, గురువారాల్లో ఉత్సవాలు కొనసాగుతాయి. చివరి రోజు భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు.

అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలోని పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణంలో జాప్యంపై హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. మనబడి, నాడు–నేడు కార్యక్రమాల్లో భాగంగా హైస్కూల్‌కు ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా మూడు గదులే నిర్మించి వదిలేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందని వాపోయారు. ఏడాది కాలంగా నిధులు, నిర్మాణ సామాగ్రి ఉన్నా గదులకు ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ చేయకపోవడంతో అసంపూర్తి పనులతో నిలిచిపోయి శిథిల రూపం దాలుస్తోందని వివరించారు. ఈ సమస్య ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని, సమగ్ర శిక్ష అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి, కార్యవర్గ సభ్యులు మోదుకూరి సత్తిరాజు, పిటి చౌదరి, కోట సత్యనారాయణరావు, పుట్టా వీరభద్రరావు, పాతూరి భాస్కరరావు పాల్గొన్నారు.

భూమి శిస్తు బకాయిలు వెంటనే చెల్లించాలి

పెదపూడి: మండలంలోని పలు దేవాలయాల పరిధిలో భూమి శిస్తు బకాయిలు చెల్లించాల్సిన కౌలు రైతులు వెంటనే ఆయా ఆలయాలకు చెల్లించాలని పుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. తక్షణం బకాయి పడిన శిస్తు చెల్లించకపోతే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. పుట్టకొండలో లక్ష్మీ నరసింహస్వామి, దోమాడలో వేణు గోపాల స్వామి, సంపర గ్రామంలో జనార్థన స్వామి, ముక్తేశ్వర స్వామి, చింతపల్లిలో వీరేశ్వర స్వామి ఆలయాలకు చెందిన భూములను కౌలుకు సాగు చేస్తున్న రైతులు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ఎన్నో లాభాలు

రాజానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందడంతో పాటు వ్యవసాయ సేవలు సులభతరంగా అందుకునేందుకు ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా ఈ గుర్తింపు సంఖ్యను పొందవచ్చన్నారు. ఇందుకుగాను ప్రతి రైతు తమ ఆధార్ నంబరు, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరుతోపాటు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని, సమీపంలోని గ్రామ రైతు సేవా కేంద్రంలో ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలన్నారు.

రాతపై పట్టు.. మార్కులు కొట్టు

- ఉత్తమ ఫలితాల సాధనకు చేతిరాత కీలకం
- దస్తూరీ మెరుగు పడితే అదనపు మార్కులు సొంతం
- నిరంతర సాధనతో సాకారం


కొంకుదురులో చేతిరాతపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

బిక్కవోలు: శిలపై ఉలితో అక్షరాలు చెక్కే కాలమైనా.. ఆధునిక యుగంలో కంప్యూటరుపై అక్షరాలు పేర్చే యుగమైనా అక్షరాల స్థానం ప్రత్యేకం. చేతి రాతను బట్టి వ్యక్తి గుణ గణాలను సైతం అంచనా వేయవచ్చంటారు గ్రాఫాలజిస్టులు. పరీక్షల్లో అదనంగా మార్కులు సాధించేందుకు దస్తూరీ కీలకంగా మారుతోంది. సమాధాన పత్రం మూల్యాంకనం చేసేవారి మనసును హత్తుకునేలా దస్తూరీ ఉండి, విషయం ఉంటే ఎక్కువ మార్కులు స్కోరు చేయవచ్చు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ తరుణంలో విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే పెడతారు. చేతిరాతపై దృష్టి పెట్టేది మాత్రం అతి కొద్దిమందే. పరీక్షల్లో సమాధానాలు ఉన్నది ఉన్నట్లు రాసినా.. దస్తూరీ లేకుంటే మార్కులు తగ్గే ప్రమాదం ఉంది. ఏం రాశామన్నది పేపరు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతేనే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో సమాధాన పత్రం పై పెట్టాలి. పరీక్ష సమయంలో సహజంగా హడావుడి, ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు అక్షరాలు చక్కగా రాసినా తర్వాత కాలం గడిచే కొద్దీ వేగం పెరగడంతో కొందరు రాతపై పట్టు కోల్పోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగానే దస్తూరీ సాధన చేస్తే పరీక్షలో ఇబ్బందులు ఉండవన్నది నిపుణుల అభిప్రాయం.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో పదో తరగతి విద్యార్థులు 2,796 మంది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు మరో 5 వేల మంది ఉన్నారు. పరీక్షలు సమీపించడంతో విద్యార్థులు రాతపై దృష్టి పెట్టాల్సిన తరుణం ఆసన్నమయ్యింది.

సాధనతోనే సాధ్యం

రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలాన్ని పట్టుకునే విధానం, కాగితానికి కలానికి మధ్య దూరం వంటి అంశాలు కీలకం. పరీక్ష పేపరుపై కలం పెట్టిన అంగుళం దూరంలో పాయింట్ ఉండాలి. సున్నా, అర సున్నా, నిలువు గీతలపై బాగా సాధన చేయాలి. ఆంగ్లం, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం సవ్యదిశలో రాయడం సాధన చేయాలి. నిర్విరామంగా సాధన చేస్తే అద్భుతమైన చేతిరాత సొంతమవుతుంది. సమాధాన పత్రం రాసేటప్పుడు గణితంతో సూత్రాలు, సమీకరణాలు కొట్టొచ్చినట్లు కనిపించేలా ఉండాలి. చిత్రపటాలు ఉంటే వాటిని ఆకట్టుకునేలా వేయాలి. శీర్షికలు, ఉప శీర్షికలు, ముఖ్యాంశాలు స్పష్టంగా కనిపించేలా వాటి కింద గీతలు(అండర్‌లైన్) వేయాలి. అవసరమైన చోట విరామ చిహ్నాలు ఉండేలా చూసుకోవాలి.

ప్రాధాన్యం పెరుగుతోంది



శాస్త్ర సాంకేతిక పరంగా ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. చేతిరాతపై దృష్టి పేట్టేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి.

కొవ్వూరి అమ్మిరెడ్డి, హెచ్‌ఎం, ఊలపల్లి ఉన్నత పాఠశాల.

మానసిక ఆందోళన వద్దు



విద్యార్థులు పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక ఆందోళనకు గురి కాకుడదు. ఆందోళన కారణంగా అక్షరాలను సరిగ్గా రాయలేరు. పరీక్షల సమయంలో విశ్రాంతి తీసుకోకుండా చదువుతుంటారు. పరీక్ష కేంద్రలోకి ప్రవేశించే వరకు కొందరు చదువుతూనే ఉంటారు. ఇది మంచిది కాదు. ఇలా చేస్తే గాబరాపడి సమాధానాలను కుదురుగా రాయలేని పరిస్థితి ఎదురువుతుంది. విశ్రాంతి లేకపోతే అలసటకు గురై దాని ప్రభావం చేతిరాతపై పడుతుంది. కూర్చునే భంగిమతో పాటు పెన్నును జవాబు పత్రంపై అధికంగా ఒత్తిడి చేసి రాయకుడదు.

వైబీఎస్ ఆచార్యులు, ఉపాధ్యాయుడు, అనపర్తి

జాగ్రత్తలు తప్పనిసరి

- సమాధాన పత్రంతో రాసే జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు ఒకటికి రెండు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీపై భాగంలో ఒక అంగుళం, ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్లు విడిచి పెట్టాలి.
- సామాన్య, భౌతికశాస్త్రంలో బొమ్మలు గీసి భాగాలను గుర్తించే విషయంలో పెన్నును ఒత్తి పెట్టి రాయకూడదు. అలా చేస్తే పేపరు వెనుక భాగం అసహ్యంగా కనిపిస్తుంది.
- పేజీకి పదహారు నుంచి ఇరవై పంక్తులకు మించి రాయకుడదు. రోజూ కొద్దిసేపు రాత సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ కూర్చొని రాయడం మంచిది. అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి.

గుండెపోటు ఇంజక్షన్‌తో ప్రాణాలు పదిలం


పెదపూడి సీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యుడు వరప్రసాద్

పెదపూడి: గుండెపోటు వచ్చిన వారికి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడేందుకు విలువైన ఇంజక్షన్ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని ఆస్పత్రి మత్తు వైద్య నిపుణులు వరప్రసాద్ తెలిపారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా, ఆరోగ్యశాఖ సిబ్బందికి ఈ ఇంజక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఎడమ వైపు ఛాతీ నొప్పి, ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు గుండెనొప్పికి కారణంగా చెప్పవచ్చన్నారు. ఈ ఇంజక్షన్‌ను నొప్పి వచ్చిన ఒక గంట వ్యవధిలో రోగికి చేస్తారని తద్వారా రోగి ప్రాణానికి ముప్పు తప్పుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు హర్షవర్ధన్, శ్రావణి, శుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విజయానికి నాలుగు సూత్రాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న స్వావలంబి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాహూ

రాజానగరం: జీవితంలో విజయాలను అందుకునేందుకు నాలుగు సూత్రాలను అనుసరించాలని భువనేశ్వర్‌కు చెందిన స్వావలంబి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ సీసీఆర్ సాహూ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ), గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రసంగించారు. కోరికలు (డిజైర్), సంకల్పం (డిటర్మినేషన్), భక్తి (డివోషన్), క్రమశిక్షణ (డిస్లిన్) అనే నాలుగు సూత్రాలు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుడుగు వేయాలన్నారు. సంకల్పం బలం ఉంటే వైఫల్యం ఎదురుకాదన్నారు. కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు, డాక్టర్ టి.జయానందకుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యం.. కోలుకోని నష్టం

- రహదారులపై ఇసుక నిల్వలు
- జారిపడుతున్న వాహనచోదకులు
- ఇసుకలో వాహనం జారిపడి ఇటీవల ఓ యువకుడి మృతి
- అధికారులు స్పందించాలంటున్న స్థానికులు


బొబ్బిల్లంక వద్ద రోడ్డుపై నిల్వ చేసిన ఇసుక, కంకర

సీతానగరం: కొద్దిపాటి నిర్లక్ష్యం కారణంగా కోలుకోని నష్టం జరుగుతోంది. చిన్నపాటి జాగ్రత్తలు పాటించి బాధ్యతగా వ్యవహరిస్తే పెద్ద ప్రమాదాలకు అరికట్టవచ్చు. బొబ్బిల్లంకలో రోడ్లపై నిల్వ చేసిన ఇసుక కారణంగా జారిపడి చిన కొండేపూడికి చెందిన దంతె ప్రసాద్ (24) ఇటీవల ప్రాణాలు కోల్పోయాడు. సీతానగరం వస్తున్న ట్రాలీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ముందు వెళుతున్న మోటారు సైకిల్ వేగం తగ్గడంతో బ్రేక్ వేశాడు. అయితే రోడ్డుపై ఇసుక ఉండటంతో మోటారు సైకిల్ జారీ ట్రాలీ కిందకు వెళ్లిపోయింది. దీంతో ప్రసాద్ మృతి చెందాడు. బొబ్బిల్లంకలో రోడ్డు విస్తరణ పనులు ముగిశాయి. కొందరు స్థానికులు తమ నివాసాల వద్ద సిమెంట్ పనులను చేయిస్తూ ఇసుకను రోడ్డుపై ఉంచుతున్నారు. అలాగే ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రోడ్డును బ్లాక్ చేసి, టెంట్లు వేస్తున్నారు. అక్కడే వేదిక కట్టి, భోజనాలు కూడా పెడుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమైనా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇలాంటి పనుల కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది బొబ్బిల్లంక వద్ద రోడ్డును బ్లాక్ చేయడంతో ములకల్లంకకు చెందిన వృద్ధురాలు ఆటో ఢీకొని మృతి చెందింది. స్టేట్ హైవే అయిన రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డును బ్లాక్ చేయకుండా చూడాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ అధికారులపై ఉంది. కానీ వారు పట్టించుకోకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

బాల్య వివాహాలపై ఇంటింటి సర్వే


రంగంపేటలో సర్వే నిర్వహిస్తున్న టీమ్ సభ్యులు

రంగంపేట: దివ్యాంగులు, బాల్య వివాహాలపై ఇంటింటి సర్వే చేపట్టినట్టు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.చంద్రమల్లేశ్వరి ఆదేశాలతో ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్‌ఎం, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టీమ్ మంగళవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించనుందని తెలిపారు. దానిలో భాగంగా మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మడికి రాంబాబు, పీఎల్‌వీ నూతలపాటి అప్పలకొండ, డాక్టర్ కె.చిన్నారావు, డాక్టర్ కె.సంకీర్తన, పీఎల్‌వీ డి.వి జయ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమణాంజలి, ఏఎన్‌ఎం, అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు మొదలు

మధురపూడి: వేసవి కాలం పూర్తిస్థాయిలో రానప్పటికీ విద్యుత్ కోతలు మొదలయ్యాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి తదితర గ్రామాల్లో సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిచిపోతోంది. ఈ అప్రకటిత కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి


రాజానగరంలో నినాదాలు చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

రాజానగరం: చాలీచాలని జీతాలతో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న తమను, తమ సేవలను గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వీఆర్ఏలు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం సమావేశమై, సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి ఈ మేరకు తమ విన్నపాన్ని తెలియజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు మల్లిమొగ్గల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రైమాన్, సలహాదారు సుబ్బారావు, డివిజన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ గ్రామోత్సవం

పెదపూడి: మండలకేంద్రమైన పెదపూడి బ్రహ్మజీ వీధిలో నంది వెంకన్న విగ్రహం వద్ద హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో హనుమాన్ గ్రామోత్సవం భక్తులు నిర్వహించారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

థియేటర్‌లో వసతులు శూన్యం

మధురపూడి: కోరుకొండ రామకృష్ణ థియేటర్‌లో యాజమాన్యం కనీస వసతులను కల్పించకుండా, టికెట్ల ధరలను విపరీతంగా పెంచుతోందని స్థానికులు పసుపులేటి సురేష్, కృష్ణ, మారిశెట్టి రమణ, కడియం సత్తిబాబు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పేరుకు మాత్రమే ఏసీ థియేటర్ అని, దాన్ని సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. రూ.80 ఉండాల్సిన టిక్కెట్‌ను రూ.150 నుంచి రూ.250 వరకూ అమ్ముతున్నారన్నారు. మూడు తరగతులకు బదులుగా బెంచీ, కుర్చీ అనే రెండు తరగతులను మాత్రమే ఉంచారన్నారు. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందిపడుతున్నారన్నారు.

కూటమి నిర్లక్ష్యంతో గ్రామాలు సతమతం



శ్రీరంగపట్నంలోని గ్రామ సచివాలయం


బురద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

- పంచాయతీ కార్యదర్శులను నియమించని ప్రభుత్వం
- శ్రీరంగపట్నంలో సమస్యల తాండవం

మధురపూడి: దేశాభివృద్ధికి గ్రామాలు చాలా కీలకం. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశ ప్రగతి సాధ్యమవుతుంది. అయితే గ్రామాల అభివృద్ధికి అత్యంత కీలకమైన పంచాయతీ కార్యదర్శులను ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. కోరుకొండ మండలంలోని మేజర్ పంచాయతీ అయిన శ్రీరంగపట్నానికి కార్యదర్శి నియామకంలో జాప్యం జరుగుతోంది. అలాగే రాజానగరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శుల కొరత తీరని సమస్యగా ఉంది. దీంతో పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. శ్రీరంగపట్నంలో రెగ్యులర్ కార్యదర్శిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. జంబూపట్నం కార్యదర్శి బీబీ ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ కార్యదర్శిగా పనిచేసిన జానా శ్రీను ఇక్కడి నుంచి రాజానగరం మండలానికి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మరో ఉద్యోగి ఇక్కడ బాధ్యతలు నిర్వహించడానికి సముఖత వ్యక్తం చేయడంలేదు. శ్రీరంగపట్నం మేజర్ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి కొరతతో అపరిశుభ్రత నెలకొంది.

అధ్వానంగా బురద కాలువ

శ్రీరంగపట్నం గ్రామం మీదుగా ప్రవహిస్తున్న బురద కాలువ అధ్వానంగా మారింది. కాలువలో వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోయాయి. శుభకార్యాలు తదితర సందర్భాల్లో వినియోగించిన ప్లేట్లు, గ్లాసులు, ఇతర వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారు. దీంతో వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోయి, నీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగుతోంది.

నకిలీ విత్తనంతో అన్నదాతల దిగాలు

- ఆర్ఎన్ఆర్ 15048 విత్తనం వాడిన రైతులు
- ముందుగానే ఈనిక దశకు పంట
- దిగుబడి బాగా తగ్గిపోయే అవకాశం
- కావవరంలో దేవీ ఏజెన్సీని తనిఖీ చేసిన వ్యవసాయాధికారులు


నకిలీ విత్తనాలతో ఈనిక దశకు వచ్చిన పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మధురపూడి: ఆరుగాలం శ్రమించి, పంట పండించి, అందరికీ అన్నం పెడుతున్న రైతులను కొందరు విత్తన వ్యాపారులు మోసం చేస్తున్నారు. అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించక పోవడాన్ని అవకాశంగా తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటన కోరుకొండ మండలం గాదరాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గాదరాడ, నరసాపురం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు ఈ రబీ సీజన్‌లో 2 వేల ఎకరాల్లో వ్యవసాయం చేశారు. దీనిలో భాగంగా ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాన్ని చల్లారు. కానీ ఇవి నకిలీ విత్తనాలు కావడంతో ముందే ఈనిక దశకు వచ్చాయి. సాధారణంగా రెండు నెలల తర్వాత ఈనిక దశకు రావాలి. దానికి విరుద్ధంగా నెల రోజులకే ఈనిక దశకు పొలం చేరుకుంది. దీని వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఎందుకంటే ధాన్యపు గింజ పాలిపోవడంతో పాటు నాణ్యత దెబ్బతింటుంది.

రైతుల ఫిర్యాదు

ఆ విత్తనం వాడిన రైతులందరూ కాపవరం గ్రామానికి చెందిన దేవీ ఏజెన్సీ యజమానిని సంప్రదించగా సరైన సమాధానం రాలేదు. దీంతో రైతులందరూ గాదరాడ రోడ్డుపై బైఠాయించారు. అలాగే వ్యవసాయశాఖ, ఎంపీడీఓ, రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతులు మైరెడ్డి సూరిబాబు, రాంబాబు, పంచాది వీర వెంకట సత్యనారాయణ, పందుళ్ల మణికంఠ, సర్వేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారులు కాపవరం దేవీ ఏజెన్సీస్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే పంట పొలాలను కూడా పరిశీలించారు. ఆ కంపెనీ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్ఎన్ఆర్ కంపెనీ మేనేజర్ ఈ నెల 14వ తేదీన రైతులతో చర్చించడానికి రానునున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, డాట్ సెంటర్ శాస్త్రవేత్త కె.శ్రీనివాస్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి పాల్గొన్నారు.